గొప్పది. మౌనం అంటే వాక్కు మౌనం కాదు. మనస్సు ఎక్కడయితే అణిగిందో అక్కడ నుండి మౌనం వస్తుంది. మనం గుంట తీసినప్పుడు నీరు పడితే అది జల కింద ఉబికి ఉబికి వచ్చేస్తుంది. అలాగే మనస్సు ఎక్కడ నుండి అయితే వచ్చిందో అక్కడికి వెళ్ళి అణిగిపోతే ఆనందం కూడా జల కింద ఉబికిఉబికి వస్తుంది. అప్పుడు సుఖం కోసం, ఆనందం కోసం బయటపరిస్థితుల మీద ఆధారపడనక్కరలేదు. చైతన్యంలో నుండి నేను అనే తలంపు వచ్చింది. ఆ నేను అనే తలంపులో నుండి మన సంస్కారాన్ని బట్టి ఇతర తలంపులు వస్తాయి. తలంపు వచ్చాక మాట వస్తుంది. లోపల ఉన్న చైతన్యానికి మాట ముని మనవడు. తాతగారిని వదిలేసి మునిమనవడిని పట్టుకొంటున్నావెందుకు? తాతగారు దొరికితే ఆయన్నే పట్టుకోండి, వాడు దొరకకపోతే ఈ మాటలు. భగవంతుడు మీ శరీరం ద్వారా మంచి పని చేయాలను కొన్నాడు అనుకోండి. దేవుడి దగ్గర నుండి ఆ ప్రేరణ ప్రారంభమయినప్పుడు మీరు ఆ పని చెయ్యకుండా ఎవరూ ఆపలేరు. నీ దేహం ద్వారా మంచి పని చేయాలని దేవుడు అనుకొన్నప్పుడు అది నీకు ఇష్టం లేకపోయినా ఆగదు. ఆ ప్రేరణ అక్కడ నుండి వస్తుంది, అది శక్తివంతంగా ఉంటుంది. కర్తృత్వం వూరికే పోతుంది అనుకొంటున్నావా? అది బుడగ అనుకొంటున్నావా పోవటానికి? నీవు పూజ చేస్తావు, జపం చేస్తావు అనుకో నీకు కపటం పోలేదు అనుకో, కర్తృత్వం ఎలా నశిస్తుంది. దీనికి ఇంద్రియాలు సహకరించాలి, మనస్సు సహకరించాలి, భగవంతుని పాదాలను ఆశ్రయించాలి. కోరిక లేకుండా కర్మ చేయాలి, ఫలాపేక్ష లేకుండా చేయాలి. కొంతమంది ఇంట్లో అందరూ మంచి వారి మధ్యే ఉంటారు కాని ఎప్పుడూ అశాంతిగా ఉంటారు. మీకు అశాంతి ఎక్కడ నుండి వస్తోంది, మనస్సులో నుండి వస్తోంది. మనస్సు విజృంభిస్తూ ఉంటే అశాంతి వస్తోంది, మనస్సు అణిగినప్పుడు శాంతి వస్తోంది. ఈ అశాంతికి కారణం నీ మనస్సు, శాంతికి కారణం నీ మనస్సు. ఆ మనస్సును సరిచేసుకోవటం మానివేసి బజారులో పడతావు ఏమిటి? ముందు మనస్సును బాగుచేసుకో, దానిని పవిత్రం చేసుకో.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 26-02-06, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ రోజు మహాశివరాత్రి. శివ అంటే శుభకరుడు, మనకు శుభాలను తీసుకొని వచ్చేవాడు, సర్వాన్ని పాలించేవాడు ఆయనే, పంచభూతాలను జీవకోటిని నియమించేవాడు, పాలించేవాడు ఆయనే. ఆయనే సర్వేశ్వరుడు. ఆయన కంటే భిన్నంగా ఏమీ లేదు. సంవత్సరంలో మీకు ఏరోజు అంటే ఇష్టం అని పార్వతి శివుడిని అడిగితే శివరాత్రి అంటే ఇష్టం అని చెప్పాడు, ఆ రోజు ఉపవాసం ఉండే భక్తులను అనుగ్రహిస్తాను అని చెప్పాడు. ఈ

రోజు సాంప్రదాయం ఏమిటి అంటే పగలు ఉపవాసం చేస్తారు, రాత్రి జాగరణ చేస్తారు. శివుడు, విష్ణువు వేరు కాదు. శివుడి యొక్క హృదయం విష్ణువు, విష్ణువు యొక్క హృదయం శివుడు. శివుడిని లింగరూపంలో ఆరాధిస్తారు, విష్ణువును మూర్తి రూపంలో ఆరాధిస్తారు. మన మనస్సు వేరు చేస్తుంది కాని ఇద్దరూ ఒక్కటే. మన మనస్సుకు ఎంతసేపు వేరు చేయటమే పని. అందుచేత నీ మనస్సు నిగ్రహంలో ఉంటే, నీ మనస్సు నీ అదుపులో ఉంటే, శాంతిగా ఉంటే మీ స్నేహితుల సహాయంగాని, బంధువుల సహాయంగాని, తల్లితండ్రుల సహాయంగాని అక్కరలేకుండానే నువ్వు సుఖంగా బతకవచ్చు అని శాస్త్రం చెప్పింది. వారు సహాయం చేస్తే స్వీకరించవచ్చు, ఒకవేళ వారు సహాయం చేయకపోయినా మీ సుఖానికి లోటు లేదు. అంటే మనస్సును నియమించుకోవటం వలన అంత గొప్పతనం వస్తుంది. మనస్సులో శాంతి ఉంటే మాటలో శాంతి ఉంటుంది, మాటలో శాంతి ఉంటే చేతలో శాంతి ఉంటుంది, అప్పుడు శరీరం ఉండగా సుఖం, మరణానంతరం కైలాసం. నేను ఎవడను? అనే విచారణ చేసి ఈ దేహం నేను కాదు, ఈ మనస్సు నేను కాదు అని తెలుసుకోవటమే నేను ఎవడను? అనే విచారణ యొక్క ప్రయోజనం అని భగవాన్ చెప్పారు. చైతన్యానికి వేరుగా నీవు లేవు. వేరుగా ఉన్నాను అనేది ఒక తలంపు మాత్రమే. ఆ తలంపును పోగొట్టటానికే నేను ఎవడను అనే విచారణ. మనిషి జీవితాన్ని పెనవేసుకొని ఉన్న అహంభావనను తొలగించటానికే అరుణాచలం ఆవిర్భవించింది. శివుడికి పేదవాళ్ళ దేవుడు అని పేరు ఉంది. ఆయనను పూజించటానికి ధనం అక్కరలేదు, బంగారం, వెండి అక్కరలేదు. ఒక అరటిపండు పెడితే చాలు, ఆయన పొంగిపోతాడు. ఒకవేళ అరటిపండు లేకపోయినా ఆయన నెత్తిమీద నీరుపోసినా ఆయన సంతోషిస్తాడు. కొంతమంది శివభక్తులు ఏమి చేస్తారు అంటే ఆయన నెత్తిమీద నీరుపోస్తూ శివనామాలు చదువుతూ ఉంటారు. మనస్సులో ఏమి అనుకొంటారు అంటే నేనేమో నీళ్ళు పెట్టి నిన్ను కడుగుతున్నాను, నీవేమో నీ అనుగ్రహంతో నా బుద్ధిని కడుగు అంటారు. అంటే నీ అనుగ్రహాన్ని పంపి నా బుద్ధిలోని దోషాలను తొలగించు అని ప్రార్థించటం.

మిమ్మల్ని ఎవరైనా స్తోత్రం చేస్తే సంతోషం వస్తుంది, విమర్శిస్తే దుఃఖం వస్తుంది. ఎందుచేతనంటే మీకు చైతన్యభావన లేదు. ఫలానా శరీరం నాది, ఫలానా పేరు నాది అనేటువంటి వ్యక్తిభావన మీకు ఉంది. మీరు కానిదానితో అంటే అనాత్మతో తాదాత్మ్యం వలన మీకు దుఃఖం వస్తోంది. అనాత్మలోనుండి విడిపోతే దుఃఖం నశిస్తుంది. మనకు ఈశ్వరచింతనలేదు, ఎంతసేపు విషయచింతనలో ఉంటున్నాము. విషయచింతన చేసే వాడికి అపవిత్రత పెరుగుతుంది, అహంభావన పెరుగుతుంది. ఈశ్వరుని స్మరించే వారికి

వ్యక్తి భావన తగ్గుతుంది, పవిత్రులవుతారు. మనం సత్యంకానిదానిని, ఆత్మకాని దానిని ధ్యానం చేస్తూ ప్రకృతి వలలో పడి, చావుపుట్టుకల మధ్య నలిగిపోతూ, దుఃఖంతో పీడింపబడుతున్నాము. ప్రారబ్దాన్ని బట్టి మనకు దేహాలు వచ్చాయి. దేహం యొక్క ప్రారబ్దాన్ని బట్టి లోపలఉన్న అంతర్యామి ఆ జీవుడిని నియమిస్తూ ఉంటాడు. దేహం ప్రారబ్ధాన్ని అనుభవిస్తూ ఉంటుంది. ప్రారబ్ధమును నేను అనుభవిస్తున్నాను అని జీవుడు అనుకొంటూ ఉంటాడు. ఇప్పుడు నీవు దేహంతో, మనస్సుతో ఎలా ఏకంగా ఉన్నావో అలాగ అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడితో ఏకమైనప్పుడు ప్రారబ్దం నిన్ను ముట్టుకోదు, అది నిన్ను అంటదు. మీరు లోపల ఉన్న సత్య పదార్థముతో ఏకమై ఉన్నారు అనుకోండి బయట పరిస్థితులు మీకు అనుకూలంగా లేకపోయినా దాని తాలుక దుఃఖం మీకు రాదు. ఎందుచేతనంటే మీరు దుఃఖంలేని వస్తువుతో ఏకమై ఉన్నారు. ఒకవేళ బయటపరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా మీకు పొంగు కూడా రాదు, మీ మొఖం అటు చూడదు. ఏ వస్తువు అయితే నీలో అంతర్యామిగా ఉందో అది నీవే అన్న సంగతి నీకు తెలిసినప్పడు దురదృష్టంగాని, అదృష్టం గాని, బయటపరిస్థితులు ఏమీ కూడా నిన్ను అంటవు.

మనం శివనామాన్ని స్మరించినా, ఆ రూపాన్ని ధ్యానించినా ఇది అంతా మనం పవిత్రులు అవ్వటానికే. మనస్సు ఏదో పని చెయ్యకుండా ఉండలేదు. ఇప్పుడు మనం శివ స్మరణ విడిచిపెట్టాము అనుకోండి విషయాలను స్మరిస్తూ ఉంటుంది. విషయాలను స్మరిస్తూ ఉంటే మనస్సుకు విషయాల మీద ఆకర్షణ కలుగుతుంది, అప్పుడు మనస్సు బాహ్యాముఖానికి పోతుంది. ఏ కారణం వలన మన మనస్సు బాహ్యాముఖానికి వెళుతోందో దానిని కత్తిరించటమే సాధన యొక్క ప్రయోజనం, ప్రతీవాడు ఇది లోపల చూసుకోవాలి. మన మనస్సు పల్చబడితే, మన మనస్సు పవిత్రం అయితే మనకు ఆనందం దొరుకుతుంది. మన మనస్సును పల్చబడేటట్లు చూసుకోవటం మానివేసి ఆనందం కోసం బజారులో వెదికితే నీకు ఎంత ధనం ఉన్నా, ఆస్తి ఉన్నా కూడా నీవు ఇలా కోటిజన్మలు ఎత్తినా ఆనందం నీకు దొరకదు. ఎందుచేతనంటే ఆనందం బయట లేదు. మీకు అందరికి నేను ఏదో సహాయం చేయటం గొప్పకాదు, మీరు అందరూ బాగుపడాలి అని నేను నిజంగా కోరుకొంటున్నానా? లేదా? అని అంతర్యామిగా ఉన్న భగవంతుడు చూస్తాడు. మీరు బాగుపడాలి అని నేను నిజంగా కోరుకోవటం లేదు అనుకోండి, ఈ ప్రవచనాలు చెప్పటం అనవసరం, నేనే కాదు ఇతరులు ఎవరైనా కూడా అంతే. ఇతరులు బాగుపడాలి అని మీరు నిజంగా లోపల కోరుకొంటూ ఉంటే, ఆ తలంపే కనుక నిజమైతే మీరు ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. దయలేనివాడు వాడికి ఎంత పాండిత్యం ఉన్నా ఆచార్యుడు అవ్వలేడు. ఈ ప్రపంచంలో

ఎక్కడికి వెళ్ళి చూసినా రాగద్వేషములు తప్ప ఏముంది? అన్నాడు బుద్ధుడు. ఈశ్వరుని దయ లేకుండా కేవలం మన ప్రయత్నం వలన రాగద్వేషముల నుండి విడుదల పొందలేము. మనకు ఉంటే ఇష్టం, లేకపోతే అయిష్టం. ఇవి లేకుండా మనం ఉదాసీనంగా ఉంటే, శాంతిగా ఉంటే మనలో ఉన్న వాసనలు పోతాయి, కొత్తవాసనలు రావు, ఇది మనం గ్రహించలేక పోతున్నాము. మనం ఉదాసీనంగా ఉండకుండా ప్రతీ గొడవలోనికి వెళ్ళి కలిసిపోతూ ఉంటే పూర్వజన్మల నుండి తెచ్చుకొన్న వాసనలు అలాగే ఉండిపోతాయి, గొడవలు పెంచుకోవటం వలన కొత్త వాసనలు వచ్చి కలుస్తాయి. చెరువులో పాత నీరు అలాగే ఉంది, కొత్త నీరు వచ్చి కలుస్తోంది. ఇంక చెరువు ఎలా ఎండిపోతుంది. మనం పవిత్రత సంపాదించ కుండా రాగద్వేషములు నశించవు. మనకు రాగద్వేషములు లేవు అనుకోండి ఇంక మనస్సుకు చాపల్యమే ఉండదు. సభ్యత ఉన్న మనిషికి, సంస్కారం ఉన్న మనిషికి హృదయం విశాలమవుతుంది, వాడు ఈశ్వరుని దయకు పాత్రుడవుతాడు. ఈశ్వరుని దయకు పాత్రుడయిన మనిషి చేసే పని వృధా అవ్వదు. ఈశ్వరుని దయ పొందటం కోసం మనం ఏదైనా పనిచేస్తే రాబోయే జన్మలో అయినా ఏదో రూపంలో మిమ్మల్ని కరుణిస్తాడు. మీరు చేసింది ఊరికే పోదు. మంచి చేసినవాడికి దుర్గతి లేదు అని పరమాత్మ చెప్పాడు. అయితే ఆ మంచి పని ఎలా చెయ్యమన్నాడు అంటే మన చెయ్యి నోట్లో అన్నం పెడుతుంది. మన నోటికి ఉపకారం చేస్తున్నాను, పొట్టకు ఉపకారం చేస్తున్నాను అని చెయ్యి అనుకోదు ఎందుచేతనంటే చెయ్యి కూడా శరీరంలో భాగమే. చెయ్యి నోటిలో పెట్టింది మరల బలంగా మారి ఆ చేతికే వచ్చేస్తుంది. మీరు సమాజం కోసం ఏదైనా చేస్తే అలాగ చెయ్యండి. ఇతరులకు నీవు ఏదైనా చేస్తే అది నీకే తిరిగి వచ్చేస్తుంది అన్న సంగతి నీకు తెలియక ఏదో వాళ్ళను ఉద్ధరించాను అని అనుకొంటున్నావు. సాధనలో అన్నింటికంటే ముఖ్యంగా తిండి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. తిండి వలన మన శరీరమే కాదు, మనస్సు కూడా తయారవుతుంది. తిండి విషయంలో జాగ్రత్తగా ఉంటే శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం బాగుంటుంది. శారీరక ఆరోగ్యం, మానసికఆరోగ్యం బాగా ఉంటే వాడు ఈశ్వర సాక్షాత్కారం పొందటానికి అర్హుడవుతాడు. శివ స్వరూపం ఎవరికి తెలుస్తుంది అంటే మూడు అవస్థలను, మూడు గుణాలను, మూడుశరీరాలను దాటినవాడికి శివస్వరూపం తెలుస్తుంది. ఎవడైతే శివానుగ్రహాన్ని పొందాడో వాడిని ఈ మూడు అవస్థల నుండి, మూడు శరీరాల నుండి, మూడు గుణాల నుండి దాటించి ఆయన స్వరూపాన్ని ఇస్తాడు, వాడే ఈశ్వరుడు. కొంతమంది మంచివారి మధ్య ఉంటారు. ఇంట్లో వారు అందరూ మంచివారే కాని ఎప్పుడూ ఏడుస్తూ ఉంటారు. మంచివారి మధ్య ఉన్నారు, ఈ ఏడుపు ఏమిటి అంటే అదొక ప్రారబ్ధం. జన్మాంతరంలో ఉన్న ప్రారబ్ధం ఇలా ఏడుపు తీసుకొని వస్తుంది, కారణం మన కళ్ళకు

కనిపించకపోవచ్చు, ఆ ఏడుపుకు ఏదో కారణం ఉంటుంది, లేకపోతే ఏడుపురాదు. పెద్ద విషయాలు తరువాత చూద్దాము ముందు మీ కళ్ళలో దోషం లేకుండా చూసుకోండి, చెవులలో దోషం లేకుండా చూసుకోండి అని పరమాత్మ చెపుతున్నాడు. నేను మిమ్మల్ని చూస్తున్నాను అనుకోండి, నా చూపు పవిత్రంగా ఉండాలి, చల్లగా ఉండాలి, అగ్నిని నీరు ఏవిధంగా అయితే ఆర్పేస్తుందో అలాగ నా చూపు మీ దుఃఖాన్ని ఆర్పివేయాలి. నేను మిమ్మల్ని చూస్తూ ఉంటే నా చూపులో ప్రేమలేదు అనుకోండి, మీరు బాగుపడాలనే కాంక్ష లేదు అనుకోండి, నా చూపు వలన మీకు చల్లదనం కలగటం లేదు అనుకోండి నా కళ్ళలో ఏదో దోషం ఉంది అని అర్థం. ముందు అది పోగొట్టుకో అని పరమాత్మ చెపుతున్నాడు. చెవిలో ఉన్న దోషం ఏమిటి అంటే కొంతమంది మంచి వినరు, ఎంతసేపు చెడ్డ వినటం కోసం కనిపెట్టుకొని ఉంటారు. ఎవరైనా బాగుపడ్డారు అని చెప్పటం కంటే వారు పాడైపోయారు అంటే ముందు వీడికి సంతోషం వచ్చేస్తుంది. మనస్సులో కూడా ఇతరుల మంచిని కోరుకోరు, ఎంతసేపు చెడుమాటలు ఎవరు చెపుతారా అని చూస్తారు, ఇంట్లో ఎవరూ చెడుమాటలు చెప్పకపోతే వారు రోడ్డుమీద పడిపోతారు, అదొక దురద. నువ్వు సాధన తరువాత చేద్దువుగాని ముందు ఈ చెవిలో ఉన్న దురదను తగ్గించుకో అంటున్నాడు శివుడు. కొంతమంది చూపులోనే రుసరుసమంటూ ఉంటారు. అందుచేత కళ్ళలో ఉన్న దోషం, చెవిలో ఉన్న దోషం ముందు ఈ దోషాలను తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి. ఆ దోషాలను తొలగించుకోకపోతే కర్మచక్రంలో తిరుగుతూ ఉంటావు, అందులో నుండి ఒడ్డుకు వచ్చే సమస్యే లేదు. ఆ దోషాలను సరిచేయాలంటే సత్పురుషులు సరిచేయాలి, గురువు సరిచేయాలి. రాగద్వేషముల వలన మనకు కలిసి వచ్చేది ఏమీ లేదు. ఉదాసీనంగా ఉండటం నేర్చుకొంటే మనం పవిత్రులం అవుతాము. బాహ్యంగా అన్నీ విడిచిపెట్టి వెళ్ళిపోతే రాగం పోదు, లోపల మనస్సులో పోవాలి. రాగద్వేషాలను తగ్గించుకోకపోతే మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతూ ఉంటుంది, అశాంతిని, బంధాన్ని పోగుచేసుకొంటుంది. రాగద్వేషాల నుండి విడుదల పొందితే నీ మనస్సే నీకు మోక్షానికి దారి చూపిస్తుంది. ఆత్మ జ్ఞానాన్ని పొందటానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు సాధనలో పడిపోతావు అనుకో అక్కడ ఆగిపోవద్దు మరల లెగిసి ప్రయాణం చెయ్యి, గమ్యాన్ని దృష్టిలో పెట్టుకో, ఆత్మవిశ్వాసం పెంచుకో. సాధన ఎలా ఉంటుందో తెలియనివారు సాధనచేసి పడిపోయిన వారిని ఆక్షేపిస్తున్నారు. వారు సాధన చేసి పడిపోయారు అసలు వీరు సాధన చేస్తే కదా పడిపోవటానికి. అసలు నడకే చేతకానివాడు ఏమి పడిపోతాడు. ఎందులోను అతిగా ఉండవద్దు. దాని వలన కొత్త వాసనలు వస్తాయి. అజ్ఞానంలో నుండి బయటపడటానికి ప్రయత్నించు. లేనిపోని గొడవలు

అన్నీ నెత్తిమీద పెట్టుకొని బంధంలో పడవద్దు, జననమరణ చక్రంలో కొట్టుకొని పోవద్దు. మీకు అర్థమవ్వటం కోసం చిన్న ఉదాహరణ చెపుతాను. నాకు ఆస్తులు లేకపోయినా, అధికారం లేకపోయినా, బంధువులు స్నేహితులు అండ లేకపోయినా ఆ రోడ్డు మీద ఉన్న గడ్డిపరక నాది అనుకొంటే పునర్మజన్మ వచ్చి తీరుతుంది. పోనీ ఆ మేడ నాది, బంగారం నాది అనుకొంటే పునర్జన్మ వస్తే సరి, అంత దూరం వరకు వెళ్ళవద్దు, ఆ గడ్డిపరకనాది అనే చిన్న తలంపు కూడా నీకు పునర్జన్మను తీసుకొని వస్తుంది. అది కర్మ సిద్ధాంతం. అందులో రాజీ పడటానికి అవకాశం లేదు. పెద్ద పెద్ద విషయాలు వదిలేయండి, గడ్డిపరక నాది అనే చిన్న తలంపు ఉన్నప్పడు నాకు పునర్జన్మ రాకుండా మీరు ఆపుచేయలేరు. మీకు ఐశ్వర్యం ఉంటే ఉండవచ్చు. అస్తమాను నాది నాది అని అనుకోకండి, అది ఈశ్వరుడిదే. మీ ప్రారబ్దాన్ని బట్టి అది మీకు కేటాయించాడు అంతే. జీవుడిని మరల శరీరంలోనికి తీసుకొని రావటానికి నాది అనే చిన్న తలంపు సరిపోతుంది. అదే ఉపనిషత్‌లో చెపుతాడు. నువ్వు అన్నం తినేటప్పడు అన్నానికి నమస్కారం పెట్టుకొని తిను. మనకు ప్రాణశక్తిని ఇచ్చేది, దేహాన్ని పోషించేది అన్నం. అన్నాన్ని ఇష్టంగా తిను, అయిష్టంగా తినకు. చిందరవందరగా అటు ఇటు విసిరేయకు, అన్నం కూడా దేవునితో సమానము. అది దేవుడిదే అని భావన చేసి తిను, అది ప్రసాదమవుతుంది.

కుచేలుడు చిన్నప్పటి నుండి చాలా దారిద్ర్యం అనుభవించాడు. దారిద్ర్యం భరించటం సామాన్యం కాదు, అది చాలా కష్టం. కొంతమంది ఇంటి దగ్గర దారిద్ర్యంతో బాధపడుతూ ఉంటే కనిపించిన వారినల్ల పట్టుకొని తిడుతూ ఉంటారు. పాపం ఆకలిబాధ అటువంటిది. కుచేలుడి దగ్గర గొప్పతనం ఎక్కడ ఉంది అంటే అంత దారిద్ర్యంతో బాధపడుతూ కూడా నన్ను ఎందుకింత దారిద్ర్యంలో పడేశావు అని ఈశ్వరుడిని తిట్టలేదు, స్నేహితులను తిట్టలేదు, బంధువులను తిట్టలేదు. ఆ దారిద్ర్యాన్ని చల్లగా, శాంతిగా అనుభవించాడు. దారిద్ర్యంలో ఉన్నప్పటికీ మనస్సుకు ప్రకోపం లేకుండా, ఉద్రేకం లేకుండా చూసుకొన్నాడు, వాడు కుచేలుడు. ఇంత దారిద్ర్యం అనుభవిస్తున్నాము, బాల్య స్నేహితుడు కృష్ణుడు ఉన్నాడు, ఆయన ప్రభువు, ఆయనను సహాయం అడుగుదాము అని ఆయనకు ఎప్పడూ అనిపించలేదు. కుచేలుడికి దారిద్ర్యం అనుభవించే ప్రణాళిక ముగిసిపోయింది. భగవంతుడి ప్రణాళిక ఎలా ఉంటుందో చూడండి. నువ్వు ఇంతకాలం నుండి దారిద్ర్యం అనుభవిస్తున్నావు, నీ చిన్ననాటి స్నేహితుడు కృష్ణుడు ఉన్నాడు, ఐశ్వర్యవంతుడు, ఆయనను సహాయం అడగవచ్చు కదా అని కుచేలుడి భార్యతో అనిపిస్తాడు. ఆమాట చెప్పించింది ఈశ్వరుడే. అప్పడు కూడా కృష్ణుడిని సహాయం అడగాలని కుచేలుడు అనుకోలేదు. కృష్ణుడి దగ్గరకు వెళ్ళమంటోంది. ఆ వంపు పెట్టుకొని

కృష్ణుడు దర్శనం చేసుకోవచ్చు అనుకొన్నాడు, అంతేగాని డబ్బులు కోసం వెళ్ళ లేదు. వాడు కుచేలుడు.

బాహ్యమైన సంపదలు ఎన్ని ఉన్నా నీ మనస్సులో శాంతి లేనప్పుడు నువ్వు సుఖాన్ని పొందలేవు. శాంతి లేనివాడికి సుఖం ఎక్కడ నుండి వస్తుంది. నీకు ఎప్పుడయితే శాంతచిత్తం కలిగిందో, నీ లోపల బండెడు దుఃఖం ఉన్నా ఆ దుఃఖం అంతా ఆనందంగా మారిపోతుంది. మనం కృత్రిమ గౌరవాలకు అలవాటుపడ్డాము. మీరు ఎక్కడయినా నుయ్యి తవ్వించారు అనుకోండి ఫలానా సుబ్బమ్మగారు నుయ్యి తవ్వించారు అని పేపరులో పడకపోయినా మీకు వచ్చే నష్టం ఏమీ లేదు. మీరు నుయ్యి తవ్వించటం సర్వసాక్షి ఈశ్వరుడు చూసాడు కదా. మీకు పుణ్యం కావలిస్తే ఆయన ఇస్తాడు. మీరు చేసిన పని మీరే పేపరులో చూసుకొని సంతోషించటం ఏమిటి? ఈ కృత్రిమ గౌరవాలలో నుండి వేరుపడకపోతే, ఈ దేహగతమైన నేనులో నుండి విడుదల పొందకపోతే ఎంత గౌరవం ఉన్నా ప్రయోజనం ఏముంది, ఆ గౌరవం ఎప్పటికయినా మీకు దుఃఖాన్ని తెచ్చిపెడుతుంది. సోదర మహాశయులారా! మీ దేహము మీరు కాదని తెలిసినప్పుడు మిమ్మల్ని స్తోత్రం చేసేవాడి దేహం వాడని మీరు ఎలా అనుకొంటారు? మిమ్మల్ని విమర్శించేవాడి దేహం వాడని మీరు ఎలా అనుకొంటారు? మీ దేహం మీరు కానప్పుడు వారి దేహాలు వాళ్ళు ఎలా అవుతారు. అందుచేత సుఖంకోసం ఆత్మ మీద ఆధారపడాలి కాని అనాత్మమీద ఆధారపడకూడదు. ఒకవేళ మనం సుఖం కోసం జడం మీద ఆధారపడితే అందులో తాత్కాలికంగా సుఖం ఉన్నట్లు మీకు అనిపించినా భవిష్యత్‌లో మీరు అనుభవించిన సుఖం అంతా దుఃఖం కిందమారిపోతుంది. నా బుద్ధి బాగాలేదు, నా బుద్ధి బాగాలేదు అంటే నీ బుద్ధి బాగుపడదు. అసలు నీవు లోపల శాంతిగా ఉంటే, ఆనందంగా ఉంటే నీ బుద్ధి బాగుపడుతుంది, బుద్ధి స్థిరపడుతుంది. పరమేశ్వరుడు అగ్రాహ్యుడు అంటే నీ మనస్సుచేత, ఇంద్రియాలచేత, బుద్ధిచేత గ్రహింపబడటానికి వీలు లేనివాడు, వాడే ఈశ్వరుడు. మనస్సు ఎక్కడయితే అణిగిందో అక్కడ ఆయన గ్రహింప బడతాడు. మనం జపధ్యానములు చేస్తూ ఉంటే, సత్కర్మ చేస్తూఉంటే, సత్కర్మ కూడా నిష్కామంగా చేస్తూఉంటే, లోపల పవిత్రత సంపాదించుకొంటే గ్రహించటానికి సాధ్యం కానివాడు కూడా నీకున్న పవిత్రత వలన, ఆయన దయవలన నీకు ఆయన గ్రాహ్యంలోనికి వస్తాడు, గోచరం కానివాడు నీకు గోచరం అవుతాడు. మా మనస్సు నిలబడటం లేదు అని కొంతమంది అంటూ ఉంటారు. దానికి కారణం ఏమిటి అంటే మీ మనస్సులో పవిత్రత లేదు అని అర్థం.

గౌతమబుద్ధుడు ఇంక కొద్దిటైములో చనిపోతాడు అనగా ఏదో ప్రశ్నించాలి అని

ఒకడు బుద్ధుడి దగ్గరకు వస్తాడు. ఇది అడిగే టైము కాదు వెళ్ళిపొమ్మని బుద్ధుడి తమ్ముడు అతనికి చెపుతాడు. ఆ మాటలు బుద్ధుడి చెవిలో పడ్డాయి. ఆయన ప్రేమ చూడండి. వాడు ఏదో అడగాలని వచ్చాడు, దగ్గరకు రానియ్యి అని చెపుతాడు. మనకు ప్రాణం పోయేటప్పుడు చాలా చిరాకుగా, విసుగ్గా ఉంటుంది. కాని ఆయన అప్పుడు కూడా బోధే. మీరు నిర్వాణ సుఖం పొందారా అని బుద్ధుని అడుగుతాడు. నిర్వాణసుఖం పొందినవాడికి నేను నిర్వాణసుఖం పొందాను అని చెప్పేవాడు ఎవ్వడూ అక్కడ ఉండడే. ఆ చెప్పేవాడు లోపల ఉంటే వాడు నిర్వాణసుఖం పొందలేదు అని అర్థం అని చెపుతూ బుద్ధుడు ఒక మంచి మాట చెప్పాడు. ఇతరులు పొందితే ఏమిటి? పొందకపోతే ఏమిటి? నీ ఆధ్యాత్మిక అభివృద్ధి ఏమిటో నీవు చూసుకో. నీవు బాగుపడే విధానం చూసుకో. బ్యాంకులో కోట్ల రూపాయలు ఉంటే ఏమి సుఖం నీ జేబులో రూపాయి లేనప్పుడు. నువ్వు సర్వవిధములుగా ప్రయత్నం చేసి ప్రేమపూరితంగా, జ్ఞానపూరితంగా, వివేకపూరితంగా జీవిస్తూ నువ్వు పొందవలసింది ఏదో పొందు. నువ్వు వైరాగ్యంగా ఉండు, వివేకంగా ఉండు అని చెపుతున్నాను. నీవు నిర్వాణ సుఖం పొందాకమటుకు నేను సాధన చేసాను, నేను వైరాగ్యంగా ఉన్నాను, వివేకంగా బతికాను అనే తలంపులు కూడా నీకు ఉండవు. ఒకప్పుడు వాటిని నీవు మోసిన ఇప్పుడు ఇంక వాటి స్పృహ నీకు ఉండదు, అదీ నిర్వాణసుఖం అంటాడు బుద్ధుడు. నువ్వు పెద్ద కష్టపడిపోనక్కరలేదు, పైసాలు ఖర్చుపెట్టనక్కరలేదు, యజ్ఞయాగాలు చేయనక్కరలేదు, నా నామాన్ని స్మరించుకో నీవు పవిత్రుడవైపోతావు. ఎవడైతే పరమపవిత్రుడో వాడి నామాన్ని స్మరిస్తూ ఉంటే నువ్వు పవిత్రుడవు అవ్వకుండా ఎలా ఉంటావు. పవిత్రుడవు అయిన తరువాత నీకు స్థిరబుద్ధి వస్తుంది, ఆ స్థిరబుద్ధికి వస్తువు గోచరిస్తుంది. కుచేలుడి దగ్గర గొప్పతనం ఏమిటి అంటే ఆయన ఎంత దారిద్ర్యం అనుభవిస్తున్నప్పటికీ మనస్సులో వికారం రాలేదు. పరమాత్మ తనకు స్నేహితుడై ఉండి, పరమాత్మ హృదయంతో అంత సన్నిహితంగా ఉన్నప్పటికీ పరమాత్మను ఐశ్వర్యం అడగాలనే తలంపు ఆయనకు రాలేదు. పరమాత్మ దగ్గరకు వెళ్ళి ఐశ్వర్యం అడగమని భార్య చెపుతుంది, ఆయన పరమాత్మను చూడగానే ఐశ్వర్యం అడగాలనే తలంపు కూడా పోయింది, అది కుచేలుడి గొప్పతనం. ఆయన పరమ పవిత్రుడు. నువ్వు ప్రకృతి చుట్టూ తిరుగుతూ ఉంటే నీకు ఆత్మసుఖం దొరకదు. నీవు ప్రకృతిలో సంబంధం తగ్గించుకోవాలి. చైతన్యంతో అనుబంధం పెంచుకోవాలి. జడభావన తగ్గించుకోవాలి, చైతన్య భావన పెంచుకోవాలి. అప్పుడు ఆత్మసుఖం నిన్ను వరిస్తుంది అని పరమాత్మ చెపుతున్నాడు. మీ చుట్టాలు, స్నేహితులు మీకు పది రూపాయలు సహాయం చేయవచ్చు, మీరు ఇబ్బంది పడుతూ ఉంటే నాలుగు చీరలు కొని ఇవ్వవచ్చు,మీ పిల్లలకు చదువు చెప్పించవచ్చు. కాని

మీకు లోపల సుఖం లేకపోతే, శాంతి లేకపోతే వారు సుఖాన్ని, శాంతిని ఇవ్వలేరు. అది గురువుకే సాధ్యం. శాంతి, ఆనందం నీ హృదయంలో నీకు దొరకకపోతే అది ఎక్కడో దొరుకుతుందని ఎప్పుడూ ఆశించవద్దు. శాంతి స్థానం, ఆనంద స్థానం నీ హృదయంలోనే ఉంది. నీ హృదయంలో వెదుకు, అది దొరుకుతుంది. ఇక్కడ దొరకలేదని ప్రకృతిలో వెదకవద్దు. హృదయంలోనే వెదుకుతూ ఉంటే అక్కడ ఉంది కాబట్టి ఈ రోజుకాకపోతే రేపు అయిన దొరుకుతుంది. నాకు మంచిస్నేహాలు దొరకటం లేదు అని ఒకడు బుద్ధుడిని అడుగుతాడు. అసలు నీలో మంచి ఉంటే మంచి స్నేహాలుదొరుకుతాయి. మంచి స్నేహాలు చేయాలనే తలంపు అసలు నీకు ఉంటేకదా. ఈ రోజు రాత్రి ఎంతకాలం జాగరణ ఉండగలిగితే అంతకాలం శివస్మరణతో ఉండి శివానుగ్రహానికి పాత్రులు అవ్వండి.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 08-01-06, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కర్తురాజ్ఞయాలో కర్త అంటే ఈశ్వరుడు. మనకు ఎంత అధికారం ఉన్నా, ఎంత ధనం ఉన్నా, ఎన్ని డిగ్రీలు ఉన్నా, బాహ్యంగా ఎన్ని ఉన్నా కూడా మనం బొమ్మలం మాత్రమే. ఈశ్వరుని యొక్క ఆజ్ఞ జరుగుతుంది. మీకు ఏదైనా మంచి జరిగింది అనుకోండి మీ తెలివితేటలు అని మీరు అనుకొంటారు. ఈశ్వరసంకల్పం ప్రకారం అలా జరగవలసి ఉంది, జరిగింది అంతే. శుభం జరిగినా అశుభం జరిగినా కూడా అంతే. మీరు ఒకసారి పెద్ద ఘనకార్యం చేయవచ్చు, ఫలితం చిన్నది రావచ్చు. ఒకోసారి చిన్నపని చేయవచ్చు, ఫలితం పెద్దగా రావచ్చు. ఎందుచేతనంటే జడవస్తువుకు ఫలితాన్ని నిర్ణయించే శక్తి లేదు. ఫలితాన్ని నిర్ణయించేవాడు ఈశ్వరుడు, అది కర్తురాజ్ఞయా. సృష్టిలో జీవకోటికి ఈశ్వరుని యొక్క ఆజ్ఞ లేకుండా ఎక్కడా ఏదీ జరగటానికి వీలులేదు, జరుగదు. మన జీవితాలు తెగిపోయిన గాలిపటాలలాగ లేవు. ఎప్పుడు ఎక్కడ ఉండాలో, మన ముక్కులో గాలి ఎప్పుడు బయటకు పోవాలో అన్నీ కరెక్టుగా నిర్ణయింపబడే మనలను భూమి మీదకు పంపుతాడు. తల్లి కడుపులో నుండి బయటకు వచ్చినప్పుడే నీవు ఏ పని చేయాలో నిర్ణయింపబడుతుంది. మన దేహ ప్రారబ్ధాన్ని బట్టి భగవంతుడు పరిస్థితులను అలా అలా గెంటుకుంటూ వస్తాడు, నీ తెలివితేటల వలన ఏమీ అవ్వదు, అది మీరు గుర్తు పెట్టుకోండి, అంతా ఈశ్వరుని ఆజ్ఞ ప్రకారమే జరుగుతుంది, అదే కర్తురాజ్ఞయా. రాష్ట్రపతి పదవికోసం ప్రయత్నం చేసి ఏ పదవి లేకుండా ఉన్నవారు ఉన్నారు. ఏ కోరిక లేకుండా పెద్ద ప్రయత్నం లేకుండా రాష్ట్రపతి అయిన వారు ఉన్నారు. ఇప్పుడు ప్రధానమంత్రి పదవికోసం ప్రయత్నం చేసి ఫెయిల్ అయ్యావు అనుకో, ఎందుచేతనంటే కర్త యొక్క ఆజ్ఞ లేదు కాబట్టి నీవు ప్రయత్నం చేసిన ఫెయిల్ అవుతావు.